సాక్షి
విజయనగరం

శనివారం । 25 । జనవరి । 2025

I



'హద్దు' మీరి అక్రమ రవాణా

పీడీఎస్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధరల డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యాపారంగా మారిపోయింది. -IIలో



బాలికల భద్రతకు భరోసా కల్పిద్దాం

బాలికలకు భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. -IIలో



క్షేత్రస్థాయిలో నేర నియంత్రణకు డ్రోన్ వినియోగం -IIలో

క్షేత్రస్థాయిలో నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ వినియోగం క్రియాశీలకంగా మారనుందని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

న్యూస్‌రీల్

బాలికా సాధికారతకు కృషి



బాలికాసాధికారతకు మద్దతుగా సంతకం చేస్తున్న కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం ఫోర్ట్: బాలికల సాధికారత, సమానత్వం సాధన దిశగా జరిగే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పిలుపునిచ్చారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల కార్యక్రమాన్ని కలెక్టర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికల రక్షణను అందరూ బాధ్యతగా భావించాలని తెలిపారు. సామాజిక, ఆర్థిక, ఆరోగ్యపరంగా బాలికల ఉన్నతి కోసం సమష్టిగా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బాలికల రక్షణకు సంబంధించిన హెల్ప్‌లైన్ నంబర్లను తెలియజేసే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు, జేసీ సేతు మాధవన్, ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీడీ సుధారాణి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' వేతనం రూ.300 వచ్చేలా చూడాలి

- గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కమిషనర్ శివప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న శివ ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: ఉపాధిహామీ పనుల్లో పాల్గొనే వేతనదారులకు సగటున రూ. 300 వేతనం వచ్చేలా పనులు కల్పించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ తెలిపారు. స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో శుక్రవారం క్షేత్ర సహాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి పంచాయతీలో చేపలపెంపకం కోసం కనీసం ఒక పాండ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం ఒక పశువుల షెడ్డు ఉండాలన్నారు. జిల్లాలో వ్యవసాయ సంబంధ పనులనే అధికంగా చేపట్టాలని సూచించారు. ప్రకృతి వనరుల యాజమాన్యంపై క్షేత్ర సహాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ జె.సునీత, డ్వామా పీడీ శారదాదేవి, ఏపీడీ మణికుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

500 క్యూసెక్కుల సాగునీరు విడుదల



కాలువ ద్వారా నీటిని విడిచిపెడుతున్న దృశ్యం

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువకు 500 క్యూసెక్కుల సాగునీటిని అధికారులు విడిచిపెట్టారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో రేగిడి, సంతకవిటి, జి.సిగడాం, వంగర మండలాల్లో 13 వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీటిని అందిస్తున్నట్టు ప్రాజెక్టు ఏఈ నితిన్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 65 మీటర్లు కాగా, ప్రస్తుతం 64.48 మీటర్ల మేర నీటిమట్టం ఉందన్నారు.

ఉత్తమ ఎన్నికల అధికారులు వీరే..

- నేడు అమరావతిలో పురస్కారాల ప్రదానం



కలెక్టర్ అంబేద్కర్



ఎస్పీ వకుల్ జిందాల్



మాలికా గార్గ్

విజయనగరం అర్బన్: ఉత్తమ ఎన్నికల అధికారులుగా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌తో పాటు ఎస్పీ వకుల్ జిందాల్, ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్ మాలికాగార్గ్ ఎంపికయ్యారు. వీరితోపాటు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ కింద ఉత్తమ ఏఆర్‌ఓగా రాజాం తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఉత్తమ బూత్‌లెవెల్ అధికారులుగా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఎం.హైమావతి, ఎం.శ్రీనివాసరావు ఎంపికయ్యారు. వీరికి విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.



రాజీవ్ క్రీడా ప్రాంగణం రోడ్డులో మంచుముసుగులో మార్కెట్



గంటస్తంభం ప్రాంతంలో కురుస్తున్న పొగమంచు



విజయనగరం నగర పాలక సంస్థ కార్యాలయం రోడ్డులో లైట్ల వెలుగులో రాకపోకలు ఇలా..



పైడితల్లి అమ్మవారి చదురుగుడి రోడ్డులో కమ్ముకున్న పొగమంచు



మంచు, చలితో వణుకుతున్న చిరువ్యాపారులు

పొగమంచు

విజయనగరం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం 8 గంటల వరకు పొగమంచు కమ్ముకుంది. దారి కనిపించకపోవడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లైట్ల వెలుగులో రాకపోకలు సాగించారు. వివిధ పనులపై వేకువజామున వెళ్లేవారు చలికి వణికిపోయారు. మంచు ప్రభావంతో కొనుగోలుదారులు లేక వ్యాపారులు ఎదురుచూడాల్సి వచ్చింది. వివిధ ప్రాంతాల్లో కురిసిన పొగ మంచును చిత్రాల్లో చూడొచ్చు. – సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



ఎం.ఆర్.కళాశాల రామమందిరం రోడ్డులో ఇలా..

సంగమేశ్వరుని అభివృద్ధి పనులకు మంగళం!

- సంగమేశ్వరుని ఆలయ అభివృద్ధిలో మీనమేషాలు
- రూ.1 కోటి నిధులు కేటాయించిన గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- నిధులు విడుదలచేయని కూటమి సర్కారు
- పనుల్లో జాప్యం
- భక్తుల్లో అసంతృప్తి
- వెయ్యేళ్లనాటి ఆలయ అభివృద్ధిపై నిర్లక్ష్యం



వంగర సంగమేశ్వర ఆలయం



సంగమేశ్వరుడు

రాజాం/వంగర:

టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలకు కోత పెట్టడమే కాదు.. ఆలయాల అభివృద్ధి పనులకూ మంగళం పాడేస్తోంది. గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు విడుదల కాకుండా అడ్డుకుని భక్తులను ఆవేదనకు గురిచేస్తోంది. కనీస సదుపాయాలు కల్పించకుండా మనోభావాలను దెబ్బతీస్తోంది. దీనికి వంగర మండలం సంగాం వద్ద ఉన్న సంగమేశ్వరుని ఆలయ అభివృద్ధి పనులపై కూటమి సర్కారు కినుక వహించడమే నిదర్శనం. సుమారు వెయ్యేళ్ల కిందట నిర్మితమైన సంగమేశ్వర ఆలయానికి విశిష్టమైన చరిత్ర ఉంది. ఈ ఆలయాన్ని గంగరాజులు నిర్మించినట్టు శాసనాలు చెబుతున్నాయి. ద్వాపర యుగంలో బలరాముడు నాగలితో నదిని ఏర్పాటుచేయడంతో పాటు ఒడిశాలోని రాయగడ సమీపంలోని పాయకపాడు, పార్వతీపురం సమీపంలోని గుంప, శ్రీకాకుళంలో ఉమారుద్రకోటేశ్వర ఆలయం, కళ్లేపల్లి వద్ద మణినాగేశ్వరస్వామి ఆలయాలతో పాటు వంగర మండలం సంగాం వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయంలో శివలింగాలు ప్రతిష్ఠించినట్టు పురాణాలు చెబుతున్నాయి.

అలహాబాద్ త్రివేణి సంగమం తరువాత మూడు నదులు కలిసి ప్రవహించేది ఇక్కడే. అటు నాగావళి, ఇటు వేగావతి, సువర్ణముఖి నదుల సంగమం ఇక్కడ జరుగుతుంది. సంగమేశ్వరుని దర్శనానికి కార్తీకంతో పాటు శివరాత్రి పర్వదినాల్లో లక్షలాదిమంది భక్తులు తరలివస్తారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి, సంగమేశ్వర ఆలయ సమీపంలో పితృదేవతలకు పిండప్రదానం చేసి, శివరాత్రి పర్వదినాల్లో జరిగే యాత్రలో పాల్గొంటారు. ఇక్కడే ఆవాసాలు ఏర్పాటుచేసుకుని, వంటావార్పిడి చేసుకుంటారు. ఆ సమయంలో కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. ఇంటిల్లపాది పిల్లాపాపలతో ఆరుబయటే నిద్రిస్తున్నారు. ఈ సమస్యలను గుర్తించిన గత ప్రభుత్వం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ చొరవతో ఆలయం వద్ద అభివృద్ధి పనులకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.కోటిరూపాయల నిధులు మంజూరుచేసింది.

చేయాల్సిన పనులు ఇవీ..

ఎండోమెంట్ కన్సర్వేషన్ గ్రాంట్ ఫండ్ (సీజీఎఫ్) ద్వారా కోటి నిధులకు గత ప్రభుత్వ హయాంలో పరిపాలనా విభాగం ఆమోదం తెలిపింది. ఇందులో రూ.90 లక్షలు ప్రభుత్వం, మిగిలిన రూ. 10 లక్షలు ఆలయ అభివృద్ధి, నిర్వహణ విభాగం, దాతల నుంచి సేకరించాలని సూచించింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం పనులు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఆలయ ఆవరణలో అమ్మవారి గుడి నిర్మాణం, మౌలిక సదుపాయాల కల్పన, యాత్రికులకోసం ప్రత్యేక గదులు, కల్యాణమండపం, ఆలయంతో పాటు గర్భగుడి ఆధునికీకరణ, స్నానపు గదులు, బాత్రూమ్‌ల నిర్మాణం, కార్యనిర్వహణ కార్యాలయ భవన నిర్మాణం చేసేందుకు తీర్మానాలు చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిధులు మంజూరు నిలిచిపోయింది. ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు కావస్తున్నా ఇంతవరకూ ఒక్క పైసా కూడా విదల్చకపోవడంతో పనులు ప్రారంభంకాలేదు.

పనులు ప్రారంభించాలి



ఇక్కడ త్రివేణి సంగమానికి ఎంతో పేరొంది. ఇక్కడ పుణ్యస్నానాలాచరించి సంగమేశ్వరుని దర్శనం కోసం ఇతర రాష్ట్రాలు నుంచి కూడా భక్తులు వస్తుంటారు. శివరాత్రి పర్వదినాన 9 నుంచి 11 రోజుల పాటు పెద్ద యాత్ర జరుగుతుంది. భక్తులకు ఆలయం వద్ద వసతిసదుపాయాలు లేవు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1 కోటి సీజీఎఫ్‌నిధులు మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో పనులు ప్రారంభంకాలేదు. కూటమి ప్రభుత్వం నిధుల విడుదల చేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. – ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, ఎంపీపీ, వంగర మండలం

నిధులు విడుదలకాలేదు

ఆలయం అభివృద్ధికి గతంలో నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఆ నిధులు విడుదలకాలేదు. అవి వచ్చిన వెంటనే ఆలయం వద్ద అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. ఆలయం అభివృద్ధితో పాటు ఇక్కడ మౌలికవసతుల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న సమస్యలపై దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదికలు అందజేశాం.

– పొన్నాడ శ్యామలరావు, ఆలయ ఈఓ, సంగమేశ్వర ఆలయం, సంగాం, వంగర మండలం

రుణ రికవరీ లక్ష్యాలను సాధిస్తున్నాం

- జిల్లా స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు



స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు

బొబ్బిలి రూరల్: జిల్లాలో పొదుపు సంఘాల మహిళలకు వృత్తి వ్యాపారాలకు అందిస్తున్న రుణాల రికవరీ లక్ష్యాలు సాధిస్తున్నామని స్త్రీనిధి జిల్లా ఏజీఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని ముత్తాయివలస గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది 28,580 మంది సభ్యులకు రూ.155 కోట్లను వివిధ రకాల వ్యాపారాలకు రుణాలుగా అందజేశామన్నారు. మరో రూ.5కోట్లను ఈ నెలాఖరుకు అందిస్తామని, రికవరీ కూడా 98 శాతం ఉందని వివరించారు. 126 రకాలైన కులవృత్తి వ్యాపారాలకు ఈ రుణాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 48 గంటల్లోనే రుణాలు అందిస్తామని చెప్పారు. రుణం పొందిన సభ్యులకు సురక్ష బీమా కింద ఇన్సూరెన్స్ ఉంటుందని, లక్షకు రూ.4 లక్షలు చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి భార్య ఉదారత

చీపురుపల్లి: పట్టణంలోని కొత్త అగ్రహారానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు తుమరాడ సర్వేశ్వరరావు భార్య జయలక్ష్మి ఉదారతను చాటుకున్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సైకిల్ షెడ్డు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం ప్రకటించారు. అందులో రూ.లక్షను పాఠశాల హెచ్‌ఎంకు శుక్రవారం అందజేశారు. దీంతో ఎంఈఓ ఎం.బూసినాయుడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జయలక్ష్మికు పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాజెక్టుల నిర్వహణే లక్ష్యంగా పనిచేయాలి

- ఇరిగేషన్ ఎస్ఈ అప్పారావు



ఎస్ఈ అప్పారావును అభినందిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

బొబ్బిలి: జంఝావతి ప్రాజెక్టు పూర్తితో పాటు ఇతర ప్రాజెక్టుల నిర్వహణ పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు తీసుకోవడమే లక్ష్యంగా పని చేస్తానని, ఇందుకు సిబ్బందిని కూడా అప్రమత్తం చేస్తానని బొబ్బిలి సర్కిల్ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన రెడ్డెం అప్పారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. గతంలో ఇక్కడ డిప్యూటీ ఎస్ఈగా పని చేసిన అనుభవం ఉందన్నారు. ఆ అనుభవంతో ప్రాజెక్టులు, కాలువల నిర్వహణ కోసం ఏ తరహా చర్యలు తీసుకోవాలో తెలుసన్నారు. ప్రస్తుతం పోలవరం డివిజన్ – 8లో పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పార్వతీపురం, బొబ్బిలి డివిజన్ల అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు.

కొత్తవలసను వాణిజ్యకేంద్రంగా తీర్దిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- కొత్తవలసలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం

కొత్తవలస: కొత్తవలస మండల కేంద్రాన్ని వాణిజ్య కేంద్రంగా తీర్చిదిద్దుతామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని సంతమార్కెట్ సమీపంలో జెడ్పీ నిధులు రూ.78 లక్షలతో బ్లాక్-1, 2లలో నిర్మించిన 14 దుకాణాలను విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాణిజ్యకేంద్రంగా రూపాంతరం చెందుతున్న కొత్తవలసకు మౌలిక సదుపాయాలు సమకూర్చుతున్నామన్నారు. సంతమార్కెట్ సమీపంలో నూతనంగా మంజూరైన ఆస్పత్రి పరీక్ష కేంద్రానికి అవసరమైన భూమిని కేటాయించామని తెలిపారు. రైతు బజారు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం కావాలని, మిగిలిన సమయాల్లో అభివృద్ధి పనులపై కలిసికట్టుగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, సర్పంచ్ మచ్చ రామస్వామి, పంచాయతీ రాజ్ డీఈ సీహెచ్ నాయుడు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చెట్టంతా పువ్వే..



సంక్రాంతి వచ్చిందంటే మామిడి పూత సీజన్ ఆరంభానికి సంకేతం. కాలానుగుణంగా మామిడి చెట్లకు పూత వచ్చింది. కొన్నిచోట్ల విరగ పూసాయి. పనుకురకాలు పూతతో చూపరులను ఆకర్షిస్తున్నాయి. పూతంతా పిందెగా మారితే అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. రెండు రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఎల్.కోట మండలం భీమాలి గ్రామం వద్ద తోటలో విరగపూసిన మామిడి చెట్టును చిత్రంలో చూడొచ్చు. – కొత్తవలస

ఓటర్స్‌డే



జాతీయ ఓటర్స్‌డే (జనవరి 25)ను పురస్కరించుకుని సంతకవిటి మండలం సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ఓటర్స్‌డే ఆకృతిగా ఏర్పడి ఆకట్టుకున్నారు. ఓటర్ల దినోత్సవ ప్రాధాన్యంను తెలియజేశారు. – సంతకవిటి

క్లుప్తంగా

సైకాలజిస్ట్ సూర్యనారాయణకు అవార్డు



అవార్డును అందజేస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్, పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి ఏ.నమఃశివాయమ్

విజయనగరం అర్బన్: పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్ రెండవ అంతర్జాతీయ సదస్సులో కేంద్ర ప్రజాసమాచార, ప్రసార శాఖ మంత్రి డాక్టర్ ఎల్.మురుగన్, పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి ఎ.నమఃశివాయమ్ చేతుల మీదుగా లీడర్ షిప్ అవార్డును పట్టణానికి చెందిన సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్‌వీఎస్ సూర్యనారాయణ అందుకున్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 'హిప్నోసిస్ ఎక్రాస్ లైఫ్ స్పాన్, ప్రమోషన్, ప్రివెన్షన్ అండ్ ఇంటర్వెన్షన్' అనే అంశంపై సదస్సు జరిగిందని ఆయన పేర్కొన్నారు. సైకాలజీ రంగంలో జాతీయస్థాయిలో ఇచ్చే ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డు లభించినందుకు సంతోషంగా ఉందన్నారు. 25 సంవత్సరాలుగా సైకాలజీ రంగంలో చేస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డు అదదజేయడం మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు.

పరిశోధనా దృక్పథాన్ని మెరుగుపరచుకోవాలి

- పుదుచ్చేరి రీసెర్చ్ అకాడమీ ఎం.డి రాజసంతోష్‌కుమార్



సత్కారం పొందుతున్న పుదుచ్చేరి రీసెర్చ్ అకాడమీ ఎం.డి టి.రాజసంతోష్‌కుమార్

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ కళాశాల స్థాయి నుంచి పరిశోధన దృక్పథాన్ని మెరుగుపరుచుకుంటే ఉపాధి, ఉద్యోగావకాశాలు అధికంగా ఉంటాయని పుదుచ్చేరికి చెందిన ఎంఎస్‌హెచ్ రీసెర్చ్ అకాడమీ ఎం.డి టి.రాజ సంతోష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గాజులరేగలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పరిశోధన పత్రాల రచన, అవగాహన, వివిధ పరిశీలనలు' అనే అంశంపై శుక్రవారం జరిగిన సదస్సుకు ఆయన ముఖ్య వ్యక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశోధన పత్రాలు ఎలా రాయాలో, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, పేపర్ పబ్లికేషన్స్ ఎలా చేయాలో తెలియజేశారు. అనంతరం ముఖ్యవక్తను ఘనంగా సత్కరించారు. పరిశోధన పత్రం కీలక పరిశీలనలు, ప్రధాన అంశాలు గురించి వివిధ మెలకువలపై అధ్యాపకులకు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి, డీన్ అకడమిక్స్ డాక్టర్ వై.నరేంద్రకుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మడ్డువలస ప్రాజెక్టు పరిసరాల్లో కొండచిలువలు



మడ్డువలస వద్ద హతమర్చిన కొండచిలువ

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు చుట్టూ కొండచిలువలు, విషసర్పాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం నమోదు కావడంతో ప్రాజెక్టు పరిసర గ్రామాల చుట్టూ ప్రాజెక్టులో నీరు చేరింది. దీంతో కొండ చాకరాపల్లి, ఎం.సీతారాంపురం, పటువర్ధనం, శ్రీహరిపురం, కొప్పర, గీతనాపల్లి తదితర గ్రామాల సమీపంలో కొండచిలువలు అలజడి సృష్టించడంతో పలు చోట్ల వాటిని హతమరుస్తున్నారు. అలాగే కొండచిలువలు గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. విషసర్పాలతో భయంగా ఉందని, ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిమట్టం తగ్గించాలని ప్రాజెక్టు తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బోడసింగిపేటలో నగదు, బంగారం చోరీ

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో శుక్రవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి అందులోని నగదు, బంగారం చోరీ చేసినట్లు బాధితురాలు ఎస్.దుర్గాభవాని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. దుర్గాభవాని, భర్త సూర్యనారాయణరాజుతో కలిసి తమ పిల్లలను విశాఖ పట్టణంలోని కాలేజీకి తీసుకుని వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకుని పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదుదారు లక్ష రుపాయల నగదు తో పాటు, రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹260

హద్దు మీరి అక్రమ రవాణా

- ఒడిశాకు తరలుతున్న పీడీఎస్ బియ్యం
- స్థానికంగా కొనుగోలు చేసి తరలింపు
- జిల్లాలో ఆరు నెలల కాలంలో కేవలం 18 కేసులు
- 415 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఆరు నెలల్లో పీడీఎస్ బియ్య కేసుల వివరాలు..	
కేసులు	15
క్రిమినల్ కేసులు	9
సీజ్ చేసిన బొలేరో వాహనాలు	8
సీజ్ చేసిన ఆటోలు	4
స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం	415 క్వింటాళ్లు



డిసెంబర్ 8న ఒడిశా రాష్ట్రం అలమండ బ్లాక్‌కు 2400 కేజీల పీడీఎఫ్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన వాహనం

పార్వతీపురంటౌన్: పీడీఎస్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధరల డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యాపారంగా మారిపోయింది. కిలోల నుంచి టన్నుల వరకు పెద్ద మొత్తంలో విక్రయిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యానికి కిలో రూ.20 నుంచి రూ.25 వరకు డిమాండ్ ఉంది. కొన్ని ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో బియ్యం సరిగా పంపిణీ చేయడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో చాలా మంది రేషన్‌డీలర్ల నుంచే అక్రమార్కులకు బియ్యం అందుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సరిహద్దు రాష్ట్రమైన ఒడిశాకు బియ్యం సరఫరా అవుతోంది. అడపాదడపా విజిలెన్స్ సిబ్బంది అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నప్పటికీ సరఫరా మాత్రం ఆగడం లేదు.

కిలో రూ.20 నుంచి రూ.25 వరకు..

చౌకధరల డిపోల నుంచి పేద ప్రజలకు అందే బియ్యం పక్కదారి పట్టడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలు, 15 మండలాల నుంచి బియ్యం సేకరిస్తుంటారు. గత ఆరు నెలల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎక్కువైందన్న విమర్శలు వస్తున్నాయి. ఒక్కో ప్రాంతంలో డిమాండ్‌ను బట్టి కేజీ బియ్యం రూ.20 నుంచి రూ.25 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది ఈ బియ్యాన్ని ఎక్కువగా ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నారు. మరికొంతమంది తూర్పు గోదావరి జిల్లాలకు తరలిస్తున్నారు.

స్థానిక కూటమి నాయకుల అండదండలతో

జిల్లాలో మైదాన ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గిరిజన ప్రాంతాల నుంచి స్థానిక కూటమి నాయకుల అండదండలతో పీడీఎస్ బియ్యం సరిహద్దులు దాటుతోంది. పదులు, వందల కేజీలు కాదు ఏకంగా వేలటన్నుల్లో బియ్యం చేరుకుంటోందని సమాచారం. కొందరు రైస్ మిల్లర్లు ఆ బియ్యాన్ని పాలిష్ చేయించి అక్రమంగా రవాణా చేస్తుంటారు. అక్కడ మంచి ధరకే విక్రయించి బాగానే సొమ్ము చేసుకుంటారని తెలుస్తోంది. ఈ నెలలో పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా సరిహద్దు దాటే వాహనాలు నేరుగా వెళ్తాయనే ప్రచారం ఉంది. ఈ అక్రమ వ్యాపారం బయటకు పొక్కకుండా ఉండేందుకు కూటమి నాయకులకు మామూళ్లు అందుతాయట. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు ఆదాయం ఏస్థాయిలో వస్తోందో.



పార్వతీపురం రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం రైలులో పట్టుకున్న పీడీఎస్ బియ్యం



ఒడిశా రాష్ట్రం అలమండకు బొలేరో వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు (ఫైల్)

మూలాలను గుర్తించడంలో విఫలం..

ఆరు నెలలుగా పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా, సంబంధిత నిందితులు అరెస్టయినా అక్రమ రవాణా ఆగడం లేదు. దీనికి ప్రధాన కారణం అసలైన మూలాలను పట్టుకోలేకపోవడమేనని తెలుస్తోంది. ఇందులో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. విజిలెన్స్, పోలీసులు దృష్టి సారిస్తున్నా బియ్యం అక్రమ రవాణాను నియంత్రించలేకపోతున్నారు. ప్రతి మండల పరిధిలో ఇద్దరి నుంచి ఐదుగురి వరకు క్షేత్రస్థాయిలో పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం. వారి నుంచి పెద్ద మొత్తంలో ఒడిశాకు సరఫరా చేసే వారికి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఎవరెవరు బియ్యాన్ని సేకరించి, అమ్ముతుంటారో అధికారులకు స్పష్టంగా తెలుసు. కానీ వారందరూ యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకోకపోవడానికి కూటమి నాయకుల ఒత్తిడే కారణమని తెలుస్తోంది.

విధిగా కేసులు నమోదు చేస్తున్నాం

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ఒడిశా సరిహద్దు గ్రామాల్లో విజిలెన్స్ అధికారులతో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతాం. వాహనాలు సీజ్ చేసి నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. ఈ నెలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులతో కలిసి 5 కేసులు నమెదు చేశాం.

– రాజేంద్ర, సీఎస్‌డీటీ, పార్వతీపురం

బాలికల భద్రతకు భరోసా కల్పిద్దాం

- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: బాలికలకు భద్రత కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం, ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత బాలికల రక్షణకు సంబంధించి ఫోరం రూపొందించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల భద్రత, ఆరోగ్యం, విద్య ప్రతి ఒక్కరూ పొందాలని చెప్పారు. బాలికలపై ఎటువంటి విషక్ష లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ చిట్టిబాబు, ఐసీడీఎస్ పీడీ సుధారాణి, ట్రీస్ ట్రస్ట్ చైర్మన్ గర్భాపు రామారావు, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శంకరరావు, ప్రజ్వల సంస్థ ప్రతినిధి పీరుబండు సత్యవతి, మౌంట్‌ఫోర్ట్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ కోర్డినేటర్ కె.వరలక్ష్మి, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ని విడుదల చేసిన జేసీ సేతు మాధవన్

క్షేత్రస్థాయిలో నేర నియంత్రణకు డ్రోన్ వినియోగం

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: క్షేత్రస్థాయిలో నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ వినియోగం క్రియాశీలకంగా మారనుందని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో 30 మంది కానిస్టేబుల్స్‌కు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలీస్‌స్టేషన్‌కు ఒక డ్రోన్ ఇవ్వనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి టెక్నాలజీ వినియోగం పట్ల అవగాహన కలిగిన పోలీస్‌కానిస్టేబుల్స్‌ను ఎంపిక చేసి, నిపుణుల పర్యవేక్షణలో వారికి డ్రోన్ ఆపరేటర్లుగా శిక్షణ ఇస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో ఓపెన్ డ్రింకింగ్, గంజాయి, పేకాట, కోడిపందాల నియంత్రణకు, క్రౌడ్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ చేసేందుకు , పండగలు, ముఖ్య నాయకుల భద్రత, బందోబస్తుల్లో డ్రోన్స్‌ను జిల్లాలో వినియోగిస్తామని తెలిపారు. శిక్షణ పొందిన కానిస్టేబుల్స్ సేవలను పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్స్ ఆపరేటర్లుగా వినియోగించి, నేరాల నియంత్రణకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐలు ఏవీ.లీలారావు, ఆర్‌వీఆర్‌కే.చౌదరి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు ఎన్.గోపాలనాయుడు, శ్రీనివాసరావు, ఆర్ఎస్సై ప్రసాదరావు, డ్రోన్స్ నిపుణులు నరేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



డ్రోన్స్ పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

ముగ్గురికి గాయాలు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద శుక్రవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తి సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు బైక్‌పై వస్తున్న ప్రదీప్, నజామా బేగంలు షికారుగంజి కూడలి వద్దకు వచ్చేసరికి ఎస్ చింతలవలస నుంచి యడ్ల సత్యనారాయణ సైకిల్ తొక్కుకుంటూ జాతీయ రహదారి దాటుతుండగా ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే ఆ ముగ్గురిని 108లో గజపతినగరం సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.



గాయాలైన వారిని 108లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

వేగావతిలో పడి యువకుడి మృతి

సాలూరు: పట్టణంలో వేగావతినది నీటిలో పడి ఓ యువకుడు మృతిచెందినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం , పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన తుపాకుల శివశంకర్(25) స్థానిక వేగావతి నది వద్ద నీటిలో మునిగిచనిపోయి ఉండడాన్ని గమనించి, యువకుడి తల్లి మంగమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శివశంకర్ బహిర్భూమికి వెళ్లి తాగిన మైకంలో నీటిలో పడిపోయి ఉండవచ్చనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



శివశంకర్ మృతదేహం

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

- కొత్తవలసలో ప్రత్యేక హాల్ట్

తాటిచెట్లపాలెం: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశాఖపట్నం, పరిసర ప్రాంతాల నుంచి వెళ్లే యాత్రికులు, ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. పెందుర్తి, కొత్తవలస ప్రాంత ప్రయాణికుల కోసం కుంభమేళా ప్రత్యేక రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–గోరఖ్‌పూర్(08562) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 16వ తేదీ రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 18వ తేదీ రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.48 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 10.50 గంటలకు బయలుదేరుతుంది. గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08561) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 19వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి 21వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ మధ్యాహ్నం 11.22 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 11.24 గంటలకు బయలుదేరుతుంది.
- విశాఖపట్నం–దీన్‌దయాల్ ఉపాధ్యాయ (08530) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 6, 20, 27వ తేదీల్లో (గురువారం) సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయలుదేరి ఫిబ్రవరి 8, 22, మార్చి1 (శనివారం)న వేకువజామున 4.30 గంటలకు దీన్ దయాల్ ఉపాధ్యాయకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఆయా రోజుల్లో సాయంత్రం 6.05 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 6.07గంటలకు బయలుదేరుతుంది.
- దీన్‌దయాల్ ఉపాధ్యాయ–విశాఖపట్నం (08529) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 8, 22, మార్చి 1(శనివారం)న రాత్రి 8.10 గంటలకు దీన్‌దయాల్ ఉపాధ్యాయలో బయలుదేరి, ఫిబ్రవరి 10, 24, మార్చి 3 (సోమవారం)వ తేదీల్లో తెల్లవారుజాము 3.25 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ తెల్లవారు 2.36 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 2.38 గంటలకు బయలుదేరుతుంది.

స్త్రీనిధి నిధులు పక్కదారిపై విచారణ

- సహకరించని గ్రూప్‌సభ్యులు
- విచారణ వాయిదా

సాక్షి ఎఫెక్ట్

బొబ్బిలిరూరల్: మండలంలోని ముత్తాయవలస గ్రామంలో పొదుపు సంఘాలకు స్త్రీనిధి ద్వారా అందించిన నిధులు పక్కదారి పట్టడంపై సాక్షి గురువారం స్త్రీనిధి నిధులు పక్కదారి అనే కథనాన్ని ప్రచురించగా స్త్రీనిధి జిల్లా ఏజీఎం ఉమామహేశ్వరరావు స్పందించి శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని రామమందిరం వద్ద నిర్వహించిన ఈ విచారణలో ముందుగా లూర్దమాత పొదుపు సంఘంలోని నలుగురు మహిళలకు అందాల్సిన రుణాలను మరొకరికి అందజేసినట్లు తేలింది. దీంతో విచారణాధికారి ఉమామహేశ్వరరావు వారిని, వీఓఏను హెచ్చరించారు. రుణాలు తీసుకున్న వారికి ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ ఉంటుందని, రుణగ్రహీతలు మరణిస్తే వారికి బీమా వర్తింపు ద్వారా రుణమాఫీ జరుగుతుందని, ఇతరులకు ఈ రుణాలను తీసుకుని వారు మరణిస్తే ఆ రుణం ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అలాగే రుణగ్రహీత బయోమెట్రిక్ ద్వారా మాత్రమే రుణం పొందగలరని, ఎలా ఇతరులకు ఈ రుణాలను అందజేశారో తెలియజేయాలని వీఓఏ సీతారాంను మందలించారు. విచారణ జరుగుతున్న సమయంలో మరి కొన్ని పొదుపు సంఘాల సభ్యులు, వారి కుటుంబసభ్యులు గుంపుగా చేరి విచారణను అడ్డుకున్నారు. విచారణ అవసరంలేదని తీవ్ర వాగ్వాదం , గందరగోళం సృష్టించడంతో ఏజీఎం విచారణను అర్ధాంతరంగా నిలిపివేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి సమయంలో విచారణ జరపలేమని, త్వరలో జిల్లా నుంచి విచారణ బృందం ద్వారా విచారణ జరుపుతామని తెలియజేశారు. కాగా ఇంకా గ్రామంలో మరో 10 సంఘాలలో ఇటువంటి రుణాలు ఇతర వ్యక్తులకే వెళ్లినట్లు, ఆయా సంఘాలను కూడా పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఆయా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, సీసీలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఇతరుల పేరుతో రుణాలను పొందిన వారిని ప్రశ్నిస్తున్న ఏజీఎం ఉమామహేశ్వరావు

వైభవంగా సహస్ర దీపారాధన

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తూర్పు రాజగోపురం సమీపంలోని వేదికపై ఉన్న ప్రత్యేక ఊయలలో సీతారామచంద్ర స్వామిని ఆసీనులను చేసి సహస్ర దీపాల కాంతుల శోభలో పవళింపు సేవ జరిపించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో సహస్ర దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.



రామతీర్థంలో ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికే 'వెల్ఫేర్ డే'

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికే పోలీస్ వెల్ఫేర్‌డేను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సమస్యలు తెలుసుకున్నారు. వారి నుంచి విజ్ఞాపనలు స్వీకరించారు. సిబ్బంది విజ్ఞాపనలు పరిశీలించిన ఎస్పీ వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. పోలీస్ సిబ్బంది తెలిపిన వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను ఎస్పీ స్వయంగా నోట్ చేసుకుని, వాటి పూర్వాపరాలు పరిశీలించి, పరిష్కరించేందుకు త్వరితగతిన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు.



పోలీస్ సిబ్బంది సమస్యలు వింటున్న ఎస్పీ వకుల్ జిందల్

గడ్డివాములు దగ్ధం

- 20 బస్తాలు ధాన్యం అగ్నికి ఆహుతి
- లబోదిబో మంటున్న రైతు

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని పట్టాలమ్మతల్లి గుడి సమీపంలో గల సంఘం చిన్నారావుకు చెందిన గడ్డివాములు, 20 బస్తాల ధాన్యం శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో కాలిబూడిదయాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు రైతు చిన్నారావు తనకు ఉన్న నాలుగు ఎకరాల్లో వరి పంట వేసి నూర్పు చేసి కళ్లంలో గడ్డిమేటలు వేశారు. అలాగే సమీప రైతు నుంచి నాలుగు ఎకరాల్లో గడ్డిని కొనుగోలు చేసి మొత్తంగా 8 ఎకరాల్లో గడ్డి మేట్లు వేశాడు. ఈ గడ్డి మేట్ల కింద 20 బస్తాల ధాన్యం నిల్వ చేశాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఎలా జరిగిందో ఏమో తెలియదు గాని గడ్డివాముల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.10 నిమిషాల వ్యవధిలో గడ్డివాములకు మొత్తం అగ్నికీలలు వ్యాప్తించాయి.దీంతో ఎస్.కోట నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డి, ధాన్యం పూర్తిగా కాలిబూడిడయాయి. దీంతో రైతు చిన్నారావు లబోదిబోమంటూ రోదించాడు. చిన్నారావుకు జరిగిన నష్టంపై అంచనా వేసి ఉన్నతాదికారులకు నివేదిస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

రీ సర్వేలో డాక్యుమెంట్లు పక్కాగా విచారించాలి

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవం

పార్వతీపురంటౌన్: రీసర్వే పనుల్లో డాక్యుమెంట్లను పక్కాగా విచారణ చేపట్టాలని పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని గోపాలపురం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి రీ సర్వే పనులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో ముందుగా సమాచారం అందించాలని, తగు రసీదులు పొందాలని స్పష్టం చేశారు. భూముల రీ సర్వేలో తలెత్తిన లోపాలను భూ యజమానికి ముందుగా నోటీసులో అందించాలని, తద్వారా తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివాదాస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిస్టర్లలో నమోదు చేయాలని చెప్పారు. రీసర్వేలో ఎక్కడా లోపాలు ఉండరాదని అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రీ సర్వే తర్వాత తప్పులు లేని భూ రికార్డులు నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

ఈతకు దిగిన ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

తగరపువలస/గరివిడి: ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్‌లో శుక్రవారం ఈతకు దిగిన ఇంజినీరింగ్ విద్యార్థి మీసాల నాని (20) మృతి చెందాడు. కొమ్మాది గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో అతను సివిల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం గరివిడి మండలం కందిపేటకు చెందిన నాని, ఆరుగురు స్నేహితులతో కలిసి సరదాగా రిజర్వాయర్‌లో ఈతకు వెళ్లాడు. ఈతకు దిగిన సమయంలో నాని రిజర్వాయర్‌లో మునిగిపోతుండటంతో, అతని స్నేహితులు కాపాడాలని కేకలు వేశారు. అక్కడే ఉన్న గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ, నాని మునిగిపోయి మృతి చెందాడు. ఆనందపురం పోలీసులు, తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది రిజర్వాయర్ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ వాసునాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాని కొమ్మాదిలోని ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నాడు. అతని తల్లిదండ్రులు వ్యవసాయదారులు.



రిజర్వాయర్ నుంచి నాని మృతదేహం వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది